క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



గొల్లపాలెంలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న భువనేశ్వరీదేవి, సభ్యులు

కాజులూరు: గొల్లపాలెంలోని సాక్షిరెడ్డి షాపింగ్ క్లాంపెక్స్ ఆవరణలో సోమవారం చలివేంద్ర ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన మహేష్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు, గ్రామ ఉపసర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి మజ్జిగ పంపిణీ చేసి ప్రారంభించారు. వేసవి కారణంగా రోజురోజుకీ ఎండల తీవ్రత పెరుగుతుండటంతో కాకినాడ, కోటిపల్లి రహదారిపై వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని మహేష్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత తన్నేరు మహేష్ తెలిపారు. క్లబ్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ బోసు బొమ్మ సెంటర్‌లో జనసేన నాయకుడు కర్రా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ సహపంక్తి భోజనాలు



జగన్నాథగిరిలో సహపంక్తి భోజనాలు చేస్తున్న బీజేపీ మహిళా మోర్చ సభ్యులు

కాజులూరు: బీజేపీ సామాజిక న్యాయ వారోత్సవాల్లో భాగంగా మహిళా మోర్చ సభ్యులు సోమవారం జగన్నాథగిరి దళితవాడల్లో సహపంక్తి భోజనాలు నిర్వహించారు. స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు కొప్పన లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సలాది వీరబాబు, మహిళామోర్చ సభ్యులు బత్తుల మాణిక్యాలు, కట్ల పాప, మోకన ధనమ్మ తదితరులు పాల్గొని మహిళలకు భోజనాలు వడ్డించారు. బీజేపీ సకల జనుల పార్టీ అని కుల, మత, వర్గాలకు అతీతంగా అందరితో కలసి అందరికోసం పని చేస్తుందనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకే ఈ కార్యక్రమం నిర్వహించామని ఎంపీటీసీ సభ్యురాలు కొప్పన లక్ష్మి తెలిపారు. పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీమా సాయం

మండపేట: ఇంటి పెద్దదిక్కును కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన బీమా సొమ్మును సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అందజేశారు. స్థానిక గొల్లపుంత కాలనీకి చెందిన బీవీవీ సత్యనారాయణ ఇటీవల ప్రమాదవశాత్తూ మృతిచెందాడు. వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయంగా మంజూరైన రూ. 10,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. మిగిలిన సొమ్ము నేరుగా లబ్ధిదారుల ఖాతాకు జమవుతాయని తెలిపారు. సచివాలయ సెక్రెటరీ శ్రీనివాసు, పార్టీ నాయకులు గునిపే భూషణం, పేరూరి మాధవి, గనిపే ఆనంద్, కాకాడ నూకరాజు, సవరపు ప్రసాద్, బత్తిన దొరబాబు, కొమ్మోజు నాగేశ్వరరావు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరుని సన్నిధిలో 'జయహో జనార్దన' చిత్ర బృందం



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో 'జయహో జనార్దన' చిత్ర బృందం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని 'జయహో జనార్దన' చిత్ర బృందం సోమవారం దర్శించుకున్నారు. చిత్ర దర్శకుడు పానుగంటి శరత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ పానుగంటి ప్రొడక్షన్స్ పేరున తన స్వీయ దర్శకత్వంలో చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. విక్రమ్‌కృష్ణ హీరోగా, రమ్యశ్రీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో చలాకీ చంటి, అదుర్స్ రఘు, మైమ్ మధు, దయానంద్, జబర్దస్త్ రాజమౌళి, బీవీఎం శివశంకర్, నెమలి రాజులు ముఖ్యపాత్రలు పోషిస్తుండగా విజయ్ ఠాగూర్ కెమెరామన్‌గా, భూపతి యాదగిరి ఆర్ట్ డైరెక్టర్‌గా చరణ్ అర్జున్ మ్యూజిక్ డైరెక్టర్‌గా, నందమూరి హరి ఎడిటర్‌గా, మోయిన్ మాస్టర్, విజయ్ మాస్టర్‌లు కొరియోగ్రాఫర్‌లుగా పనిచేస్తున్నారన్నారు. సినిమా కోనసీమ పరిసర ప్రాంతాల్లో దిగ్విజయంగా రెండో షెడ్యూల్ పూర్తి చేసుకున్న సందర్భంగా భీమేశ్వరస్వామిని మొత్తం చిత్ర బృందంతో కలసి దర్శించుకున్నామన్నారు. త్వరలోనే సినిమా రిలీజ్ చేస్తామని తప్పకుండా విజయం సాధిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

వేసవి విడిది కేంద్రం గ్రంథాలయం

- ఖాళీ సమయాన్ని ఇక్కడ గడపడమే మేలు
- విద్యా సంవత్సరం చివరిలో పెరిగిన ప్రాధాన్యం
- పోటీ పరీక్షల అభ్యర్థులకు ప్రయోజనం
- గ్రంథాలయాల్లో సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి



కపిలేశ్వరపురం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను పరిశీలిస్తున్న పాఠకులు

కపిలేశ్వరపురం: ఖాళీగా ఉన్న బుర్ర దెయ్యాల కోట అనే సామెత ఉంది. మనిషన్నాక విస్తృతమైన ఆలోచనలు చేస్తుంటాడు. ఆ ఆలోచనలను మంచి వైపు మళ్లించగలిగితే మహాద్భుతాలు చేసే సామర్థ్యం పొందగలుగుతారు. విద్యా సంవత్సరం చివరదశకు రావడం, కొన్ని కోర్సుల వారికి పరీక్షలు సైతం పూర్తి కావడం, సెలవులు కలిగిన వారికి సమయం అందుబాటులో ఉంటున్న నేపథ్యంలో వారంతా తమ ఖాళీ సమయాన్ని గ్రంథాలయంలో గడపడం మేలు. వేసవిలో గ్రంథాలయాల ప్రాధాన్యతపై ఈ కథనం...

మండపేట నియోజకవర్గంలో ఒక మున్సిపాలిటీ, 43 గ్రామాలు, రామచంద్రపురం నియోజకవర్గంలో ఒక మున్సిపాలిటీ, 77 గ్రామాలున్నాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మండపేట పట్టణంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రేడ్-1 గ్రంథాలయం 1, మున్సిపాలిటీ పర్యవేక్షణలో మరొకటి ఉన్నాయి. రాయవరం, మాచవరం, కపిలేశ్వరపురం, అంగర, వెల్ల, ద్రాక్షారామ, పామర్రు, అముజూరు, కాజులూరు లలో గ్రేడ్-3 గ్రంథాలయాలున్నాయి. వల్లూరులో వీడీసీ గ్రంథాలయం, అర్తమూరు, తాపేశ్వరం, తదితర గ్రామాల్లో ప్రైవేట్ గ్రంథాలయాలున్నాయి.

గ్రంథాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

తొమ్మిదేళ్లలో ఎన్నడూ లేని విధంగా గ్రంథాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించింది. ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాలకు 2021లో రూ.1.22 కోట్లతో 1,06,903 పుస్తకాలు సమకూర్చింది. వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీల పేరుతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 223 గ్రంథాలయాలకు భవనాలు నిర్మిస్తోంది. పుస్తకాలను డిజిటలైజేషన్ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే 90 వేల పుస్తకాలను కంప్యూటరైజ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 102 ప్రభుత్వ గ్రంథాలయాల్లో 57 గ్రంథాలయాలకు సొంత భవనాలున్నాయి. 14 అద్దె భవనాల్లోనూ, 31 ఉచితంగా ఏర్పాటు చేసిన భవనాల్లో నడుస్తున్నాయి. రామచంద్రపురంలో భవనం సమకూర్చింది.

విలువైన పుస్తకాలు ఉన్నాయి



గ్రంథాలయ సంస్థ విద్యార్థులకు, పోటీ పరీక్షల అభ్యర్థులకు విలువైన పుస్తకాలను సమకూర్చింది. సమయాన్ని కేటాయించి చదువుకునేందుకు ఆసక్తి చూపడం ద్వారా మేలు కలుగుతుంది.

–దానేటి శివకుమారి, గ్రంథాలయాధికారి, కపిలేశ్వరపురం

రెండు నియోజకవర్గాల్లో గ్రంథాలయాలు ఇలా...

మండలం	గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో
మండపేట అర్బన్	గ్రేడ్-3 - 01
రాయవరం	గ్రేడ్-3 - 02
కపిలేశ్వరపురం	గ్రేడ్-3 - 02
రామచంద్రపురం	గ్రేడ్-1 - 01
రామచంద్రపురం రూరల్	గ్రేడ్-3 - 02
కె.గంగవరం	గ్రేడ్-3 - 02
కాజులూరు	గ్రేడ్-1- 01

బేతస్థ సంస్థ సేవలు అభినందనీయం



కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభోత్సంలో సత్యనారాయణ, రాజ్‌కుమార్ తదితరులు

మండపేట: మహిళల స్వయం ఉపాధికి బేతస్థ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ అన్నారు. స్థానిక సంఘం కాలనీలో సంస్థ వ్యవస్థాపకుడు కొప్పిశెట్టి రాజ్‌కుమార్, సుశీల దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. రాజ్‌కుమార్ మాట్లాడుతూ 2004లో రామచంద్రపురంలో ప్రారంభించిన తమ సంస్థ ద్వారా నాలుగు ప్రాంతాల్లో కుట్టుశిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ఎందరో పేద మహిళలకు కుట్టుమిషన్, అల్లికలు, ఎంబ్రాయిడరీలలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆరు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్నామని చెప్పారు. తమ సేవా కార్యక్రమంలో భాగంగా మండపేట సంఘం కాలనీలోని గాడ్ గ్రేస్ చర్చిలో ఐదో ఉచిత కుట్టు మెషీన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. చర్చి పాస్టర్ వాసంశెట్టి కిరణ్‌పాల్, జీవన కుమారి, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

ఆహార నియమాలపై అవగాహన అవసరం



అంగరలో గర్భిణులకు సూచనలు చేస్తున్న వైద్యులు రత్నకుమారి, ప్రియాంక

కపిలేశ్వరపురం: ఆహార నియమాలపై గర్భిణులు, వారి సహాయకులకు అవగాహన అవసరమని అంగర పీహెచ్‌సీ డాక్టర్లు పి.రత్నకుమారి, జె.అనూజ ప్రియాంక అన్నారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా సోమవారం అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీలలోనూ కపిలేశ్వరపురం సీహెచ్‌సీలోనూ ఆయా ఆసుపత్రుల వైద్యులు గర్భిణులను పరీక్షించారు. అంగరలో 27 మంది గర్భిణులను పరీక్షించగా ఐదుగురిని హైరిస్క్‌గా గుర్తించారు. వారికి పీహెచ్‌సీ ఆశ కార్యకర్త పి.సుజాత పండ్లు, శీతల పానీయాలు అందజేశారు. వాకతిప్ప పీహెచ్‌సీలో 22 మందికి ఆరుగురుని హైరిస్క్‌గానూ, అచ్యుతాపురం పీహెచ్‌సీలో 25 మందికి ఏడుగురిని, కపిలేశ్వరపురం 8 మందికి ముగ్గరుని హైరిస్క్‌గా గుర్తించారు. మొత్తం నాలుగు ఆసుపత్రుల్లో 72 మందిని పరీక్షించగా 21 మందిని హైరిస్క్‌గా గుర్తించి మెరుగైన పరీక్షలు చేయించాలని నిర్ణయించారు.

వరకట్న వేధింపులపై కేసు

రాయవరం: అదనపు కట్నం కావాలంటూ వేధిస్తున్న భర్త లవకిరణ్‌పై భార్య చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. రాయవరం ఎస్సై సురేష్ కథనం ప్రకారం చెల్లూరుకు చెందిన చంద్రకళకు రామచంద్రపురానికి చెందిన లవకుమార్‌తో వివాహమైంది. అదనపు కట్నం కోరుతూ భార్య చంద్రకళను భర్త లవకిరణ్ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. దీనిపై చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై సురేష్ తెలిపారు.

జనరంజకంగా సీఎం జగన్ పాలన

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- గొల్లపుంతలో గడప గడపకూ..



గొల్లపుంత వాసులకు చేకూరిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి సోమవారం ఆయన స్థానిక 16వ వార్డు గొల్లపుంతలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల ప్రభుత్వ ప్రగతిని ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా?, ఏమైనా సమస్యలున్నాయా? అంటూ స్థానికుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తన దృష్టికి తెచ్చిన ఆయా సమస్యలను ఎమ్మెల్సీ తోట అక్కడికక్కడే మున్సిపల్ అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడారు. ఈ నాలుగేళ్లలో జగన్ ప్రభుత్వం చేసిన ప్రగతిని వివరించేందుకు, ప్రజలతో మమేకం అయ్యేందుకు చేపట్టిన గడప గడపకూ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయనన్నారు. కౌన్సిలర్ మెండు బాపిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారయ్య, విప్ పోతంశెట్టి ప్రసాద్, సొసైటీ చైర్మన్ కుక్కల రామారావు, కార్పొరేషన్ల డైరెక్టర్లు మీగడ శ్రీనివాస్, ఆలీఖాన్‌బాబా, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, సయ్యద్ రబ్బానీ, పెంకే గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఊరు వాడా 'జగనన్నే మా భవిష్యత్తు'



అర్తమూరులో వేడుకగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి తదితరులు



అంగరలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

మండపేట: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఊరువాడ జోరుగా సాగుతోంది. గృహ సారథులతో పాటు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజాభిప్రాయ సేకరిస్తున్నారు. మండలంలోని కేశవరంలో సోమవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు సచివాలయ కన్వీనర్లు అద్దంకి రమణ, కొల్లి సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీటీసీ మాజీ సభ్యుడు తుపాకుల ప్రసన్నకుమార్ తదితరులతో కలిసి ఇంటింటికీ పర్యటించారు.

మండలంలోని అర్తమూరులో గ్రామ సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించింది. ఏడిదలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్ ఆధ్వర్యంలో సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, కుడిపూడి రాంబాబు తదితరులు గృహసారథులతో కలిసి పలు ఇళ్లను సందర్శించారు. ద్వారపూడిలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లుతో సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు, సొసైటీ చైర్మన్ దంతులూరి శ్రీరామవర్మ తదితరులు ఇంటింటికి వెళ్లి స్థానికులతో మమేకమయ్యారు. కొవ్వూరు పట్టణంలోని అన్ని వార్డుల్లోను కౌన్సిలర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఇంటింటా పర్యటన చేశారు.

కపిలేశ్వరపురం: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ప్రజల్లో విశేష ఆదరణ ఉందని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మండలంలోని అంగర, పడమర ఖండ్రిక, టేకి, మాచర తదితర గ్రామాల్లో సోమవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఇంటింటి పర్యటన చేశారు. ఆయా గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుంచి కుటుంబాలకు వచ్చిన లబ్ధిని వివరించారు. సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు మేడిశెట్టి దుర్గారావు, చేనేత సహకార సంఘం చైర్మన్ జి.శివరామకృష్ణ, నాయకులు పసలపూడి శ్రీనివాస్, కవల శ్రీనివాస్, వాసంశెట్టి వాసు మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి ప్రజలు తమ మౌలిక అవసరాలను తీర్చుకోగలుగుతున్నారన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సీఎం పాలన

కాజులూరు: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్రంలో సీఎం జగన్ పాలన సాగుతుందని శీల గ్రామ సర్పంచ్ కోమలి వెంకటరమణ అన్నారు. సోమవారం మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లోనూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి నాడు-నేడు ప్రభుత్వ పాలనలో వ్యత్యాసాలను వివరిస్తూ పార్టీ నుంచి వచ్చిన ప్రశ్నపత్రంలోని ఐదు ప్రశ్నలకు జవాబులు రాబడుతూ ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. స్టిక్కర్లు, కరపత్రాలు పంచిపెట్టారు. శీలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ మాట్లాడుతూ జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అని, వాటిని ఉపయోగించుకోవటంలో ప్రజల్లో సరైన అవగాహన కల్పించటం ద్వారా మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి తీసుకురాగలమన్నారు. కార్యక్రమాల్లో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు, మండల గృహసారథుల కమిటీ చైర్మన్ చింతపల్లి నాగేంద్రప్రసాద్, సర్పంచ్‌లు పిల్లి కృష్ణమూర్తి, నెల్లి బ్రహ్మాజీ, ఎంపీటీసీ సభ్యులు దడాల భీమేశ్వరరావు, దాస్యం సుమన్ తదితరులు పాల్గొన్నారు.



యర్రపోతవరంలో స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ రాంబాబు తదితర నాయకులు



శీలలో స్టిక్కర్లు పంచుతూ ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్న గృహ సారథులు, పార్టీ నాయకులు

ఇంటింటా సంక్షేమ సందడి

కె.గంగవరం: మండలంలోని 26 గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాలు నాలుగో రోజు సోమవారం ఇంటింటా సంక్షేమ సందడితో సాగాయి. వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఇంటింటికీ వెళ్లి జగన్ పాలనలో నాలుగేళ్ల సంక్షేమ సమాచారాన్ని తెలియజేస్తున్నారు. ప్రతి ఇంటికి వారి అనుమతితో స్టిక్కర్ అంటించి సర్వేను నిర్వహిస్తున్నారు. ఆ ఇంట్లో వారితోనే వారి ఫోన్ నుంచే 82960 82960 ఫోన్ నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇస్తున్నారు. యర్రపోతవరం సర్పంచ్ పిల్లి రాంబాబు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ఆయనే స్వయంగా లబ్ధిదారులకు వివరించారు. సచివాలయ కన్వీనర్ తోకల శ్రీను, పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ద్రాక్షారామలో ఎంపీటీసీ సభ్యురాలు సత్యవతి, కన్వీనర్లు, గృహ సారథులు, ప్రజాప్రతినిధులు

ఊరూ..వాడా ఒకటే నినాదం.. జగనన్నే మా భవిష్యత్

రామచంద్రపురం రూరల్: దేశ చరిత్రలోనే తొలిసారిగా రాష్ట్ర ప్రజల కోసం చేసిన మేలును గుర్తు చేస్తూ.. భవిష్యత్తులోనూ మీ మద్దతు ఇవ్వండని కోరుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా మద్దతు సర్వేలో ఊరూ..వాడా ఒకటే నినాదం విన్పిస్తోంది. అదే 'జగనన్నే మా భవిష్యత్' నినాదం. ప్రజాప్రతినిధులు, గ్రామ/వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రతి గ్రామంలోనూ ఇంటింటికీ వెళ్లి గత తెలుగుదేశం పాలనలో రాష్ట్ర ప్రజలకు జరిగిన అన్యాయాలు వివరిస్తూ, జగనన్న పాలనలో మేలును గుర్తు చేస్తూ ప్రజా మద్దతు పుస్తకంలో పొందుపరిచిన ఐదు ప్రశ్నలు ప్రజలకు అడిగి వారి సమాధానాలను నమోదు చేస్తున్నారు. భవిష్యత్తులోనూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు ఇస్తారా అని అడుగుతున్న ప్రశ్నకు యావత్ ప్రజానీకం ముక్తకంఠంతో అవును అనే సమాధానం ఇస్తున్నారు. దీనితో వైఎస్సార్ సీపీ శ్రేణులు నూతనోత్తేజంతో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ప్రజల ఇష్టపూర్వక అనుమతితో సీఎం చిత్రంతో ఉన్న స్టిక్కర్లను ఇళ్లకు అంటిస్తున్నారు.

విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి



సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లకు సూచనలిస్తున్న పృథ్వీరాజ్

మండపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఉనికిని కాపాడుకునేందుకు విపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలని వైఎస్సార్‌సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా అవినీతికి తావు లేకుండా పూర్తి పారదర్శకంగా రాష్ట్రంలో సంక్షేమ పాలన అమలవుతోందన్నారు. అన్ని వర్గాల ప్రజలు సీఎం జగన్ పాలనకు మద్దతు తెలుపుతున్నారన్నారు. ప్రభుత్వ పనితీరుతో తమకు పుట్టగతులుండవన్న ఆందోళనతో ప్రతిపక్ష పార్టీలు సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారానికి తెర లేపుతున్నాయన్నారు. పార్టీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లు వైఎస్సార్ ప్రభుత్వ పాలనకు, గత టీడీపీ పాలనకు వ్యత్యాసంతో పాటు క్షేత్రస్థాయిలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు చేరుతున్న తీరును వివరించాలని పృథ్వీరాజ్ సూచించారు. మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లోని సోషల్ మీడియా కన్వీనర్లు హాజరయ్యారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



కేశవరంలో ఫిషర్‌మెన్ షెడ్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

మండపేట: ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మండపేట ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కేశవరంలో మత్స్యకారుల కోసం రూ. ఏడు లక్షలతో నిర్మిస్తున్న ఫిషర్‌మెన్ షెడ్, అలాగే రజకుల కోసం రూ. ఏడు లక్షలతో నిర్మిస్తున్న దోబీఘాట్ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. పనుల ప్రగతిని గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పూర్తి నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా చెరువు గట్టుపై షెడ్డు లేక చేపలు అమ్ముకునేందుకు మత్స్యకారులు, చెరువు వద్ద దోబీ ఘాట్ లేక దుస్తులు ఉతుక్కునేందుకు రజకులు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఎంపీటీసీ సభ్యుడు చంద్రమళ్ల పోతురాజు, వైఎస్సార్ సీపీ నేత కొప్పిరెడ్డి ప్రసాద్, బీసీ, ఎస్సీ, ఎస్సీ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ టీడీపీ ధర్నా

మండపేట: విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు సోమవారం స్థానిక మారేడుబాక సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపుతో సామాన్యులు అగచాట్లు పడుతున్నారన్నారు. అనంతరం ఏడీఈ తిరుమలరావుకు ఆయా డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

కపిలేశ్వరపురం: అంగర విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద టీడీపీ నాయకులు సోమవారం ఆందోళన చేశారు. తరచూ పెంచుతున్న విద్యుత్ చార్జీలు వల్ల పేద, మధ్యతరగతి ప్రజలపై భారం పడుతోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డి ప్రసాద్, పుత్సల శ్రీనివాస్, అల్లూరి రామకృష్ణంరాజు, కాదా వెంకట రాంబాబు, జయబాబు పాల్గొన్నారు.

కాజులూరు: ఆర్యావటం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సలాది సాయిబాబు ఆధ్వర్యంలో కార్యకర్తలు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట కాకినాడ, కోటిపల్లి రహదారిపై కొద్దిసేపు ధర్నా నిర్వహించి ఏఈ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర

రాయవరం: మండలంలోని నదురుబాదలో సోమవారం రాత్రి ముత్యాలమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఏటా అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహిస్తున్నారు. సర్పంచ్ చింతపల్లి శ్రీనివాసరావు సతీ సమేతంగా పూజలు చేసి అమ్మవారి జాతరను ప్రారంభించారు. జాతరలో భాగంగా గరగ నృత్యాలు, బ్యాండు మేళాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం నుంచి అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించనున్నారు.